సాక్షి

డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

బుధవారం । 16 । జూలై । 2025



కుమార్తె కోసం తల్లిడిల్లి..

తన కుమార్తె నాలుగు నెలలుగా కనిపించడం లేదన్న మనస్తాపంతో కొవ్వూరుకు చెందిన మహిళ గోదావరిలో దూకి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది.

-8లో..



నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి వేదుల బాల (నాగోల్, రంగారెడ్డి జిల్లా) రూ.లక్ష విరాళాన్ని మంగళ వారం సమర్పించారు.

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి 1,59,747క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. ధవళేశ్వరం వద్ద మంగళవారం సాయంత్రం 10.70 అడుగులకు నీటి మట్టం చేరింది. డెల్టా కాలువలకు 14,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

న్యూస్‌రీల్

రాజోలు వైఎస్సార్ సీపీ పరిశీలకుడిగా నాగేంద్ర



నాగేంద్రను అభినందిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి తదితరులు

అమలాపురం టౌన్: రాజోలు నియోజకవర్గం వైఎస్సార్ సీపీ పరిశీలకునిగా అమలాపురానికి చెందిన పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి వచ్చిన ఉత్తర్వులను జిల్లా పార్టీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి ద్వారా నాగేంద్ర మంగళవారం అందుకున్నారు. రావులపాలెం మండలం గోపాలపురంలోని క్యాంపు కార్యాలయంలో జగ్గిరెడ్డి ఆయనకు ఉత్వర్వులు అందజేసి అభినందించారు. వాస్తవానికి ఇటీవల రాజోలు నియోజకవర్గానికి పార్టీ పరిశీలకునిగా అమలాపురానికి చెందిన పార్టీ నాయకుడు వంటెద్దు వెంకన్నాయుడును నియమించారు. అయితే ఆయన అమెరికాలోని తన కుమారిడి వద్దకు వెళ్లారు. దీంతో ఆ పదవిలో నాగేంద్రను నియమించి భర్తీ చేశారు. ప్రస్తుతం మున్సిపల్ కౌన్సిలర్‌గా, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షునిగా పనిచేస్తున్న నాగేంద్ర గతంలో పార్టీ పట్టణ అధ్యక్షుడిగా సమర్ధవంతంగా పనిచేశారు. దీంతో నాగేంద్ర అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ కో ఆర్డినేటర్, మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ జిల్లా పార్టీకి ఆయన పేరును సూచించారు. తనను రాజోలు పరిశీలకునిగా నియమించనందుకు మాజీ మంత్రి విశ్వరూప్‌కు, జిల్లా పార్టీ అధ్యక్షుడు జగ్గిరెడ్డికి నాగేంద్ర కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ పటిష్టతకు తన వంత కృషి చేస్తానని నాగేంద్ర తెలిపారు. తర్వాత రాజోలు నియోజకవర్గ పార్టీ కో ఆర్డినేటర్, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావును కూడా నాగేంద్ర కలిసి ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. నాగేంద్రతో పాటు పార్టీ జిల్లా ఐటీ విభాగం అధ్యక్షుడు తోరం గౌతమ్ రాజా, మున్సిపల్ కౌన్సిలర్ చిట్టూరి పెదబాబు పాల్గొన్నారు.

ఉప్పాడ తీర ప్రాంత కోత నివారణకు రక్షణ గోడ

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ఉప్పాడ తీర ప్రాంతం కోత నివారణకు రూ.323 కోట్లతో రక్షణ గోడ నిర్మించేందుకు కేంద్రం సుముఖత వ్యక్తం చేసిందని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు దశాబ్దాలుగా యేటా సగటున 1.23 మీటర్లు మేర కోతకు గురవుతుండగా, ఒక్క 2017–18 ఏడాదిలోనే 26.3 మీటర్లు కోతకు గురైందన్నారు. ఇది ఉప్పాడ, నేమాం, అమీనాబాద్, సుబ్బంపేట, కొమరగిరి గ్రామాల మత్స్యకారుల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. రక్షణ గోడ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీకి అందజేసిన ప్రాజెక్ట్ రిపోర్ట్‌ను చెన్నైలోని నేషనల్ సెంటర్ ఫర్ పోస్టల్ రీసెర్చ్‌కు పంపించగా రూ.323 కోట్లతో టెట్రాపాడ్‌ల ఆధారంగా శాశ్వత రక్షణ గోడ నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసిందన్నారు. వీటిని ఆమోదించేందుకు ఈ నెల 30న ఢిల్లీలో కేంద్ర హోం శాఖ కార్యదర్శి అధ్యక్షతన సబ్ కమిటీ సమావేశం జరగనుందన్నారు.

వరుస పురస్కారాలపై హర్షం



రెడ్‌క్రాస్ పురస్కారాలను కలెక్టర్ షణ్మోహన్‌కు అందజేస్తున్న చైర్మన్ వైడీ రామారావు తదితరులు

కాకినాడ సిటీ: రెడ్‌క్రాస్ జిల్లా శాఖ మరొకసారి పురస్కారాలు పొందడం మనకు గర్వకారణమని రెడ్‌క్రాస్ జిల్లా శాఖ అధ్యక్షుడు, కలెక్టర్ షణ్మోహన్ సగిలి హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ రెడ్‌క్రాస్ శాఖ అధ్యక్షుడు, గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా రాష్ట్ర స్థాయిలో 2021–22 నుంచి 2023–24 సంవత్సరం వరకు వరుసగా మూడు సంవత్సరాలు అత్యుత్తమ జిల్లా శాఖగా కాకినాడ జిల్లా మొదటి స్థానాన్ని గెలుచుకోగా పురస్కారాలను సంస్థ చైర్మన్ వైడీ రామారావు, కోశాధికారి ఎస్‌వీవీఆర్‌కె ప్రసాద్ బాబు, కార్యదర్శి కె శివకుమార్ మంగళవారం కలెక్టర్‌కు అందజేసిన సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఉత్తమ జిల్లా శాఖ అవార్డులు ఏర్పాటు చేసినప్పటి నుంచి వరుసగా ఏడుసార్లు మన జిల్లా శాఖ రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలవడం గర్వకారణమన్నారు. చైర్మన్ వైడీ రామారావు మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని నూతన సేవా కార్యక్రమాల ద్వారా రెడ్‌క్రాస్ ప్రతిష్టను ఇనుమడింప చేయడానికి కృషి చేస్తామన్నారు. ఇటీవల రెడ్‌క్రాస్‌కు సేవలు అందించి గవర్నర్ ద్వారా పురస్కారాలు అందుకున్న ఓఎన్‌జీసీ, కేఎస్‌పీఎల్ ప్రతినిధులకు, సాయిరామ ఫ్రోజెన్ ఫుడ్స్ అధినేత ఎల్ సత్యనారాయణ, ఫిలిం డైరెక్టర్ బి సుకుమార్‌లకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు.

నిర్లక్ష్యపు తుప్పు

- జిల్లాలో శిథిలావస్థకు చేరిన లాకులు, క్వార్టర్లు, బల్ల కట్లు
- కార్యాలయాల వద్ద తుక్కుగా చేరిన ఉక్కు పరికరాలు
- గాలికి వదిలేసిన అధికారులు
- పాడైన రూ.లక్షల విలువైన ఇనుము
- సద్వినియోగం చేయడంలో వైఫల్యం

గతం ఎప్పుడూ ఘనమైనదే. నాటి వారు ఏం చేసినా ఆలోచించే చేశారన్నది నిర్వివాదాంశం. వారి సంకల్పాలు సైతం ఉక్కు సంకల్పాలై భావి తరాల బాగు కోసం అప్పటికి అందుబాటులో ఉన్న సాంకేతికత, వనరులను సద్వినియోగం చేశారనడంలో అతిశయోక్తి ఉండదు. కానీ వారి సంకల్పాలను అందిపుచ్చుకోవడంలో ప్రస్తుత అధికారులు ఎప్పుడూ విఫలమవుతూనే ఉన్నారనడానికి ఎన్నో ఉదాహరణలు. నీటి పారుదల శాఖనే తీసుకుంటే అతికినట్టు సరిపోయే సామెత ఏరు దాటాకా తెప్ప తగలేయడం. ఆ శాఖలో వివిధ ప్రయోజనాలకు గతంలో అధికారులు ఇనుము, ఉక్కుతో తయారు చేసిన బల్లకట్లు, లాకుల వద్ద ఏర్పాటు చేసిన గేట్లు, రెయిలింగ్‌లు అన్నదాతలకు, సాధారణ ప్రజలకు ఎన్నో సేవలందించాయి. ఏళ్లు గడిచాయి. సాంకేతికత పెరిగింది. అభివృద్ధి అంతకంతకూ పెరుగుతోంది. ఇక అప్పటి అధికారులు ఏర్పాటు చేసిన పరికరాలతో పనేముందనుకున్నారో ఏమో ఎక్కడివక్కడ తీసి ఆ పక్కనో ఈ పక్కనో పడేసి వారి అడ్డు తొలగించుకున్నారు. వాటిని మరే ఇతర అవసరాలకైనా వినియోగించవచ్చుననే ఆలోచన కూడా వారికి రాలేదో.. మరే కారణమో కానీ.. నాటి తరం అధికారుల సంకల్పాలకు తుప్పు పట్టించేశారు.

సాక్షి, అమలాపురం: జల వనరుల శాఖ అంటేనే నిర్లిప్తతకు... నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం. సాగునీటి యాజమాన్యం, మురుగునీరు బయటకు వెళ్లేలా చేయడం.. కాలువలలో పూడిక తొలగింపు.. షట్టర్ల మరమ్మతులు.. ఇలా ప్రతి పనిలో ఆ శాఖ నిర్లక్ష్యం ప్రస్ఫుటమవుతూనే ఉంది. వీరి నిర్వాకం వల్ల ప్రతి ఖరీఫ్‌లోను వేలాది ఎకరాల్లో పంట నీట మునగడం.. రబీలో వందల ఎకరాలలో చేలు ఎండిపోవడం గోదావరి డెల్టాలో పరిపాటిగా మారింది. వీరి నిర్లక్ష్యానికి తుప్పు పడుతున్న టన్నుల కొద్దీ ఇనుము కూడా అతిపెద్ద ఉదాహరణగా నిలుస్తోంది.

గోదావరి తూర్పు, మధ్య డెల్టా కాలువల మీద రాకపోకలు సాగించేందుకు వీలుగా గతంలో బల్లకట్లు ఏర్పాటు చేసేవారు. రైతులు, ఆయా గ్రామాల ప్రజలు వీటిమీద రాకపోకలు సాగించేవారు. ఇటీవల కాలంలో పంట కాలవల మీద పెద్ద ఎత్తున వంతెన నిర్మాణం చేసిన విషయం తెలిసిందే. దీనికి తోడు కొత్త రహదారులు ఏర్పడటంతో బల్ల కట్ల వినియోగం గణనీయంగా తగ్గింది. వీటిని సమీపంలోని ఇరిగేషన్ కార్యాలయాలకు తరలించారు. కొన్నింటికి వేలంపాటలు పెట్టి విక్రయించడం ద్వారా ఆ శాఖ ఆదాయం పొందింది. మరికొన్నింటిని మాత్రం గాలికి వదిలేసింది. వీటితో పాటు ప్రధాన పంట కాలువల మీద ఉన్న లాకులు, రెగ్యులేటరీ పైపులు, డీపీల వద్ద దెబ్బ తిన్న షట్టర్లు, లాకుల మీద రక్షణగా ఉన్న రెయిలింగ్ దెబ్బతినడంతో వాటిని కూడా కార్యాలయాలకు తరలించి అక్కడే ఉంచారు. గడిచిన కొన్నేళ్లుగా వాటి ఆలనా పాలనా చూసేవారు లేకపోవడంతో అవి తుప్పు పట్టి ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయి. వీటికి కూడా వేలం నిర్వహిస్తే లక్షలాది రూపాయల ఆదాయం వస్తుందని తెలిసి కూడా అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు దారితీస్తుంది.

కళ్ల ముందే తుప్పు పడుతున్నా

మధ్య డెల్టా పరిధిలో లొల్ల లాకుల వద్ద ఇనుము ఇలా తుప్పుపట్టి పోతోంది. కాలువలు దాటే బల్ల కట్లు (చిన్న పంట్లు), షట్టర్లు, లాకుల వద్ద రెయిలింగ్, ఇతర ఇనుము వస్తువులు రోజుల తరబడి ఎండకు ఎండుతూ... వానకు తడుస్తున్నాయి.

తుప్పుపట్టి ఎందుకూ పనికి రాకుండా పోతున్నాయి. ఇరిగేషన్ కార్యాలయం చెంతనే ఇవి ఎందుకూ పనికిరాకుండా పోతున్నా అధికారులలో మాత్రం చలనం లేదు. లొల్ల లాకుల పరిధిలో ఎక్కడ దెబ్బతిన్న షట్టర్లు ఇతర విడిభాగాలు ఇక్కడకు పట్టుకు వచ్చి పెడుతున్నారు తప్ప వాటి పాలనా పాలన పట్టించుకునేవారు కరువయ్యారు.





లొల్ల లాకుల వద్ద తుప్పు పట్టి పాడవుతున్న ఇనుము వస్తువులు



రావులపాలెం మండలం వేదిరేశ్వరం వద్ద బల్లకట్టుపై కాలువ దాటుతున్న రైతులు

శిథిల భవనంలో తుప్పు పట్టి ఇలా..

తూర్పు డెల్టాలో కీలకమైన లాకులలో రాయవరం మండలం పసలపూడి లాకు ఒకటి. ఈ లాకు వద్ద పలు భవనాలు శిథిలమయ్యాయి. వాటిలోనే వేలాది రూపాయలు విలువ చేసే ఇనుము తుప్పు పట్టి పోతోంది. ప్రధాన లాకులకు వినియోగించిన గేట్లు ఇతర ఇనుప పనిముట్లు భవనంలో వదిలేశారు. ఏళ్లు గడుస్తున్నా వీటి ఆలనా పాలనా చూసేవారు లేకుండా పోయారు. ఇక్కడ శిథిలమైన ఐదారు గేట్లను పట్టించుకునేవారు లేకపోవడంతో గేట్ల నిర్మాణంలో వినియోగించిన అతి బరువైన ఐరన్ కడ్డీలు సైతం తుప్పు పట్టి నిరుపయోగంగా మారాయి. మరమ్మతులు చేసే అవ కాశం ఉన్నా జలవనరుల శాఖ అధికారులు పట్టించుకోవడంలేదని ఆయకట్టు రైతులు మండిపడుతున్నారు.



పసలపూడి లాకుల వద్ద నిరుపయోగంగా పడి ఉన్న ఐరన్ గేట్లు

చోరీకి గురవుతున్న రెయిలింగ్



చోరీకి గురై ధ్వంసమవుతున్న ఐరన్ రైయిలింగ్

పి.గన్నవరం మండలం మొండెపులంక లాకులు వద్ద పరిస్థితి ఇది. లాకులు పైనుంచి వెళ్లే రహదారుల వద్ద రక్షణ కోసం ఏర్పాటు చేసిన ఐరన్ రెయిలింగ్ ఇలా ధ్వంసం అవుతూ చోరీకి గురవుతోంది. ఈ లాకుల వద్ద ఇప్పటికే పలు రకాల ఇనుము వస్తువులు చోరీకి గురయ్యాయి. అయినా అధికారులలో చలనం మాత్రం కలగడం లేదు. లాకులు, లాకు చాంబర్‌పై రక్షణగా ఏర్పాటు చేసిన రైలింగ్ దెబ్బతినడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశముంది. సమీపంలో ఉన్న లంక గ్రామాల నుంచి స్థానికులు వ్యవసాయ ఉత్పత్తులను ఎడ్లబళ్ల మీద, వాహనాల మీద తెచ్చుకుంటారు. కనీసం రక్షణ చర్యలలో భాగంగా నైనా చోరీకి గురవుతున్న ఐరన్ వస్తువులను పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు పక్కన నిరుపయోగంగా..



పంట కాలవ చెంతనే పడి ఉన్న దోనె

రాయవరం మండలం మాచవరం వద్ద పంట కాలవ దాటేందుకు ఏర్పాటు చేసిన దోనె పరిస్థితి ఇది. స్థానికంగా కాలువ దాటి మారేడుబాక వెళ్లే ప్రయాణికుల కోసం దీనిని ఏర్పాటు చేశారు. తర్వాత ఇది వినియోగంలో లేకుండా పోయింది. గత కొన్నేళ్లుగా పంట కాలవ పక్కనే ఉంటున్న దీనిని అధికారులు పట్టించుకోవడం మానేశారు.

పెన్షన్ వ్యాలిడేషన్ బిల్లు రద్దు చేయాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న పెన్షనర్లు

అమలాపురం రూరల్: కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ఆర్థిక బిల్లుతో ఆమోదించిన పెన్షన్ వ్యాలిడేషన్ బిల్లు వెంటనే రద్దు చేయాలి ప్రభుత్వ పెన్షనర్లు అసోసియేషన్ జిల్లా శాఖ అధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద మంగళవారం ధర్నా చేశారు. తొలుత పారుపూడి కృష్ణశాస్త్రి ధర్నాను ప్రారంభించారు. దశాబ్దాల పాటు పోరాటాలు చేసి పెన్షనర్స్ సాధించుకున్న హక్కులు, ప్రయోజనాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాయడం అమానుషమని, దీనిపై అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు ఫెడరేషన్, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అమరావతి, గుంటూరు సంయుక్తంగా పెన్షనర్ల హక్కుల పరిరక్షణకు విధి లేని పరిస్థితులలో పోరుబాటను ఎంచుకోవలసి వచ్చిందని జిల్లా ప్రధాన కార్యదర్శి కేకేవీ నాయుడు డిమాండ్ చేశారు. ఈ సవరణ అమలులోకి వస్తే కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులు, పెన్షనర్లు మాత్రమే కాక రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు కూడా నష్టపోయే అవకాశం ఉంది. మాజీ ఎమ్మెల్సీ, పెన్షనర్ యిళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యోగ, పెన్షనర్లకు కాంప్రహెన్సివ్ హెల్త్ ఇన్స్యూరెన్స్ స్కీమ్ అమలు చేయాలని కోరారు. జేఏసీ చైర్మన్ సీహెచ్ రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి కోదండ రామయ్య, ట్రెజరర్ దోనిపాటి పృథ్వీ, మండలీక ఆదినారాయణ, వెంకటేశ్వర్లు, జిల్లా ఫ్యాప్టో సెక్రటరీ జనరల్ పోతంశెట్టి దొరబాబు, ఎం.సాయి వరప్రసాదరావు తదితరులు కలెక్టర్‌కు ఈ మేరకు వినతి పత్రాన్ని అందించారు.

వాటర్ స్పోర్ట్స్ సౌకర్యాలకు టెండర్లు

- కలెక్టర్ మహేష్ కుమార్
- పర్యాటక పరమైన ఆదాయ సముపార్జనపై అధికారులతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: దిండి, ఆత్రేయపురం, అంతర్వేది బీచ్ అడ్వెంచర్ వాటర్ స్పోర్ట్స్ ఫెసిలిటీ సౌకర్యాలను మెరుగుపరిచేందుకు ఆరు పాయింట్లు గుర్తించి టెండర్లు పిలిచినట్టు కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో పర్యాటక రంగ అభివృద్ధి అధికారులు ఆరు బోటింగ్ పాయింట్లకు సంబంధించి ఏజెన్సీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించి ఇటీవల సమర్పించిన సమగ్ర ప్రతిపాదనలపై సమీక్షించారు. వశిష్ట గోదావరి బంగాళాఖాతంలో కలిసే నదీముఖ ద్వారం వద్ద బోటింగ్ స్పోర్ట్స్ నిర్వహించి పర్యాటకంగా ఆదాయ సముపార్జించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. గౌతమి గోదావరి, వశిష్ట గోదావరి నదుల శాఖలు కాటన్ బ్యారేజీ వద్ద ఉద్భవించి కోనసీమ జిల్లా మీదుగా ప్రవహించి బంగాళాఖాతంలోకి ప్రవేశిస్తుందన్నారు. కాటన్ బ్యారేజీ భాగంలోని బొబ్బర్లంక హెడ్ లాక్‌ల నుంచి ప్రారంభమై ప్రధాన కాలువ బొబ్బర్లంక నుంచి ఆత్రేయపురం మండలంలోని లొల్ల వరకు దాదాపు 13 కిలోమీటర్ల పొడవున ప్రవహిస్తుందన్నారు. ఇక్కడ ఒక అద్భుతమైన పురాతన నిర్మాణం, అలాగే వాడపల్లి వేంకటేశ్వర ఆలయం యాత్రికులు సందర్శిస్తుంటారని, స్థానిక ఆధ్యాత్మిక భావన పర్యాటకులకు కొత్త అనుభూతిని ఇస్తుందనీ పర్యాటకులు స్పీడ్ బోట్లు, ఫుడ్ కోర్టులు, బోటింగ్ స్పోర్ట్స్ అనువుగా తీర్చిదిద్దాలన్నారు. జేసీ టి.నిశాంతి, పర్యాటక శాఖ ఆర్డీ పవన్‌కుమార్, బోటింగ్ అధికారి గంగబాబు, జిల్లా పర్యాటక అధికారి అన్వర్, ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రతి ఎకరాకు సాగు నీరు

ఆయకట్టులో స్థిరీకరించిన ప్రతి ఎకరాకు సకాలంలో సాగునీరు అందించే దిశగా జల వనరులు, వ్యవసాయ, రెవెన్యూ అధికారులు పూర్తి భాగస్వామ్యం వహించాలని కలెక్టర్ మహేష్ కుమార్ ఆదేశించారు. మంగళవారం రెవెన్యూ, వ్యవసాయ జలవనరుల శాఖ అధికారుల సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి సాగునీటి సరఫరా స్థితిగతులపై సమీక్షించారు. చివరి ఆయకట్టుకు సాగునీరు రావడం లేదని ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో తగిన పరిష్కార మార్గాలు సూచించాలని అధికారులను ఆదేశించారు. డ్రైనేజీలలో పూడికతీత పనులపై ప్రత్యేక దృష్టి సారించి క్లీనింగ్‌కు చర్యలు చేపట్టాలని డ్రైనేజీ ఇంజినీర్లను ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ నిశాంతి, జిల్లా వ్యవసాయ అధికారి బోసు బాబు, జల వనరుల డ్రైనేజీ ఇంజినీర్లు పాల్గొన్నారు.

పేదరికం లేని సమాజమే లక్ష్యంగా పీ–4

పేదరికం లేని సమాజాన్ని నిర్మించడమే పీ–4 లక్ష్యమని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ వెల్లడించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆర్థిక గణాంకశాఖ అధికారులు డీఆర్డీఏ, డ్వామా, జీఎస్‌డబ్ల్యూఎస్ సిబ్బంది, విజన్ డాక్యుమెంట్ యూనిట్ సిబ్బందితో పీ–4 పథకం అమలుపై రాష్ట్ర ప్రణాళిక శాఖ సంప్రదింపుదారులు అవగాహన సమావేశాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పేదవారిని ఆర్థిక సామాజిక రంగాల్లో తీసుకువచ్చేలా ఈ పథకాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. జిల్లా వ్యాప్తంగా 64 వేల బంగారు కుటుంబాలను గుర్తించడం జరిగిందని వీరిని మార్గదర్శకులకు దత్తత ఇచ్చేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీవో మురళీకృష్ణ ఎల్‌డీఎం కేశవ వర్మ, డ్వామా పీడీ మధుసూదనరావు, డీఆర్‌డీఏ పీడీ గాంధీ, జిల్లా ఉద్యాన అధికారి బీవీ రమణ పాల్గొన్నారు.

యువతకు ఆసరా.. ఉపాధికి భరోసా

- ఆర్‌టీసీలో హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ
- నిరుద్యోగులకు అండగా ఏపీఎస్ ఆర్‌టీసీ
- ఐదేళ్ల కాలంలో 305 మందికి తర్ఫీదు
- సుశిక్షితులైన నిపుణులతో నిర్వహణ
- 21 బ్యాచ్‌కు దరఖాస్తుల ఆహ్వానం



బ్యాచ్ ప్రారంభోత్సవంలో సూచనలు ఇస్తున్న రవాణాశాఖాధికారి శ్రీకాంత్‌బాబు



డ్రైవింగ్ మెటీరియల్ అందజేస్తున్న ఆర్‌టీసీ అధికారులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ ఆర్‌టీసీ) అంటే ముందుగా గుర్తుకు వచ్చేది సురక్షితమైన, సుఖవంతమైన ప్రయాణం. ఏపీఎస్ ఆర్‌టీసీ ప్రయాణికుల సేవలో కాకుండా నిరుద్యోగ యువత బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తుంది. ఆసక్తి గలవారికి హెవీ వెహికల్ డ్రైవింగ్‌లో శిక్షణ ఇస్తోంది. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ డ్రైవింగ్ స్కూళ్లు ఏర్పాటు చేశారు. 2020వ సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిరుద్యోగ యువత భవిష్యత్‌కు భరోసా కల్పించేందుకు వీటిని ప్రారంభించారు.

వాహన చట్టాలపై అవగాహన

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పార్లమెంట్ నియోజకవర్గాల్లో ఆర్టీసీ హెవీ వెహికల్‌లో డ్రైవింగ్ పాఠశాలలు ప్రారంభించింది. అందులో భాగంగా కాకినాడ జిల్లా కేంద్రమైన కాకినాడ ఆర్‌టీసీ కాంప్లెక్స్‌లో హెవీ డ్రైవింగ్ శిక్షణ కార్యాలయం ఏర్పాటు చేసి యువతీ యువకులను బ్యాచ్‌లుగా ఏర్పాటు చేసి డ్రైవింగ్‌లో శిక్షణ, వాహన చట్టాల గురించి అవగాహన కల్పిస్తున్నారు. దీనికోసం నామమాత్రపు ఫీజు నిర్ణయించారు. శిక్షణ పూర్తి చేసేవారికి సర్టిఫికెట్‌తో పాటు హెవీ డ్రైవింగ్ లైసెన్స్ ఇప్పించి వారి జీవితానికి భరోసా కల్పిస్తున్నారు. ఇక్కడ డ్రైవింగ్ నేర్చుకుంటున్న అభ్యర్థులు భవిష్యత్‌లో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో డ్రైవర్లుగా స్థిరపడేందుకు అవకాశం ఉంటుంది. ప్రభుత్వ రంగాల్లో అయితే ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్లో శిక్షణ పొందిన వారికి ప్రాధాన్యం ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటి వరకూ 19 బ్యాచ్‌లలో 305 మంది శిక్షణ పొందారు. నిరుద్యోగ యువతకు భవిష్యత్ కల్పించడం, డ్రైవింగ్‌లో మెళకువలు నేర్పించడం ముఖ్య ఉద్దేశమని అధికారులు చెబుతున్నారు.

21వ బ్యాచ్‌కు దరఖాస్తుల ఆహ్వానం



హెవీ వెహికల్ డ్రైవింగ్‌లో అభ్యర్థులకు సుశిక్షితులైన నిపుణులతో శిక్షణ అందిస్తున్నాం. రాత్రివేళ్లలో డ్రైవింగ్ నేర్పిస్తాం. సమయ పాలన ,క్రమశిక్షణ, అంకితభావంతో డ్రైవింగ్‌లో మెళుకువలు నేర్పుతూ రోజూ తరగతి గదిలో పాఠాలతో పాటు గ్యారేజీలో ఇంజిన్ భాగాలపై అవగాహన కల్పిస్తున్నాం. ఘాట్‌రోడ్డు ఎత్తు, పల్లం వంటి ప్రాంతాలలో ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నాం. ప్రస్తుతం 21వ బ్యాచ్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాం.

– కే.డీ.ఎం.రాజు డ్రైవింగ్ స్కూల్ ఇన్‌స్పెక్టర్

హెవీ లైసెన్స్‌కు శిక్షణ



జేఎన్‌టీయూకేలో బీటెక్ ఇంజినీరింగ్ అభ్యసిస్తున్నాను. భవిష్యత్‌లో కొన్ని ఉద్యోగాలకు హెవీ డ్రైవింగ్ లైసెన్స్ అడిగే అవకాశం ఉంది. శిక్షణతో పాటు లైసెన్స్, డ్రైవింగ్‌కు సంబంధించి అన్ని విషయాలపై అవగాహన కల్పిస్తున్నారు.

– ఎం.జోష్, కాకినాడ

డ్రైవింగ్‌పై అవగాహన వచ్చింది



కేంద్ర ప్రభుత్వ సంస్థల ఉద్యోగాలకు సంబంధించి డిఫెన్స్ వంటి వాటికి హెవీ లైసెన్స్ తప్పనిసరిగా అడుగుతున్నారు. డ్రైవింగ్‌తో పాటు లైసెన్స్ జారీకు ఆర్‌టీసీ అందిస్తున్న సేవలు వినియోగించుకున్నాను. ఇటువంటి వాటి ద్వారా నేర్చుకుంటే అవగాహన పూర్తిగా వస్తుంది.

– పి.బాలురెడ్డి, పీఆర్ డిగ్రీ కళాశాల

3న జాతీయ చదరంగం పోటీలు



జాతీయ స్థాయి చదరంగం టోర్నమెంట్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ: జాతీయ స్థాయిలో ఆల్ ఇండియా ఇండిపెండెన్స్ చదరంగం టోర్నమెంట్‌ను కాల్ ఫ్యూజన్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో ఆగస్టు 3న నిర్వహిస్తున్నట్లు టోర్నమెంట్ డైరెక్టర్ విత్తనాల హైమావతి తెలిపారు. మంగళవారం టోర్నమెంట్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ లోరియల్ హై గ్లోబల్ స్కూల్ ఆధ్వర్యంలో రూ.1,23,456 నగదు బహుమతితో ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీలకు దేశం నలుమూలల నుంచి సుమారు 400 మంది వరకు చదరంగ క్రీడాకారులు హాజరవుతారన్నారు. విజేతలకు నగదు బహుమతులు, మెమెంటోలను అందజేస్తామన్నారు. స్కూల్ డైరెక్టర్ సుంకర రవికుమార్, ప్రిన్సిపాల్ ఏక్తా, టోర్నమెంట్ డైరెక్టర్ హైమావతి, చెస్ అకాడమీ డైరెక్టర్ విత్తనాలకుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహిళపై దాడి

8 మందిపై కేసు నమోదు

ధవళేశ్వరం: ఇంటి తగాదాకు సంబంధించి మహిళపై దాడి చేసిన 8 మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ టి.గణేష్ తెలిపారు. ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. రాజీవ్ కాలనీలో తిరుకోటి పావని అనే మహిళ పేరుపై బిల్డింగ్ ఉంది. ఈ ఇల్లు తనదేనంటూ కొత్తూరు పార్వతి అనే మహిళ పేర్కొనడంతో కొంత కాలంగా వివాదం నడుస్తోంది. మంగళవారం కొందరు ఇనుప రాడ్లతో ఇంటికి వచ్చి తనపై దాడి చేయడంతో గాయపడినట్లు పావని ఫిర్యాదు చేసింది. పావని ప్రస్తుతం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈ ఘటనపై ఐదుగురు మహిళలు, ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు సీఐ గణేష్ తెలిపారు.

మన్నించు మహాత్మా..

గాంధీజీ విగ్రహం చేయి ధ్వంసం

రాజానగరం: గాంధీజీ విగ్రహాన్ని ఆకతాయిలు ధ్వంసం చేశారు. గాంధీ బొమ్మ కూడలిగా పేరొందిన ఈ ప్రాంతం నిత్యం రద్దీతో ఉంటుంది. అయితే రాత్రి వేళల్లో మాత్రం తాగుబోతులకు ఆలవాలంగా మారుతుంటుంది. ఈ నేపథ్యంలో ఎవరు, ఎందుకు కారకులయ్యారో గానీ మహాత్ముని కుడి చేతిని విరగొట్టారు. ఆర్యవైశ్యులు ఎక్కువగా ఉండే ఈ ప్రాంతంలో ఆగస్టు 15కి, అక్టోబరు 2న గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసేందుకు పోటీపడుతుంటారు. రెండు నెలలుగా మొండి చేతితో ఉన్న మహాత్ముని విగ్రహం వారెవరి దృష్టిలో పడకపోవడం విచిత్రం.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



ప్రమాదంలో గాయపడిన అమ్మాజీ



గాయపడ్డ మోటార్ సైకిలిస్టు

గండేపల్లి: మల్లేపల్లి హైవేపై మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. స్థానికుల సమాచారం మేరకు గ్రామానికి చెందిన గుండు అమ్మాజీ గ్రామంలో సచివాలయం-2 వద్ద జరిగే వారపు సంతలోకి నిత్యావసర వస్తువుల కోసం రోడ్డు దాటుతోంది. అదే సమయంలో రాజమహేంద్రవరం నుంచి సుమారు మూడేళ్ల పాపతో ప్రత్తిపాడు మండలం ధర్మవరానికి మోటారుసైకిల్‌పై వెళ్తున్న ఆర్.దొరబాబు ఆమెను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో గాయపడి రోడ్డుకు మధ్యలో పడ్డ వీరిని స్థానికులు పక్కకు తీసుకువచ్చి సపర్యలు అందించారు. ప్రమాదం జరిగిన సమయంలో అటుగా ఎటువంటి వాహనాలు రాకపోవడంతో ప్రాణనష్టం తప్పిందని స్థానికులు అంటున్నారు. మూడేళ్ల పాపకి ఏమైందోనని పలువురు కలవరపాటుకు గురయ్యారు. ఆ చిన్నారి బయాందోళనకు గురికావడంతో గ్రామానికి చెందిన యువకుడిని మోటార్ సైకిలిస్టుకు తోడుగా వెంట పంపించారు. సంతకు వచ్చిన వాహనాలు రోడ్డుకు పక్కనే పార్కుచేయడంతో మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, కనీసం వారపు సంత రోజైనా పోలీస్ సిబ్బందిని ఏర్పాటుచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అన్నదాతకు అండ

- పంటల పరిరక్షణలో గుడ్ల ద్రావణం
- ప్రకృతి వ్యవసాయంలో ఎగ్ అమ్మోనియా యాసిడ్ తయారీ
- చీడపీడలకు, నాణ్యమైన ఉత్పత్తికీ ఎంతో ఉపయుక్తం

పిఠాపురం: రోజు గుడ్డు తినండి ఆరోగ్యంగా ఉండండని వైద్యులు సూచిస్తుంటారు. మంచి బలవర్ధకమైన ఆహారంగా గుర్తించబడిన గుడ్డు ఇప్పుడు పంటలకు సైతం మంచి పోషకరంగా పని చేస్తోంది. సేంద్రియ వ్యవసాయ పద్ధతుల్లో అనేక ద్రావణాలు అందుబాటులోకి వచ్చినప్పటికీ ప్రస్తుతం గుడ్ల ద్రావణం మంచి ప్రాముఖ్యతను సంతరించుకుంది. తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనాలు అందించే ద్రావణంగా దీనికి గుర్తింపు రావడంతో గొల్లప్రోలు మండలం దుర్గాడ గో గాయత్రి ప్రకృతి వనరుల తయారీ శిక్షణ కేంద్రంలో గుడ్ల ద్రావణం తయారీ చేపట్టారు. దీని తయారీ విధానాన్ని కేంద్రం నిర్వాహకుడు గుంద్ర శివచక్రం వివరించారు.

తయారీ విధానం ఇదీ..

ముందుగా గుడ్లను పగలకుండా జాగ్రత్తగా శుభ్రం చేసుకుని పక్కన పెట్టుకోవాలి. వాటిని శుభ్రం చేసుకుని సిద్ధం చేసుకున్న ప్లాస్టిక్ జార్‌లో జాగ్రత్తగా పెట్టి అవి పూర్తిగా మునిగే వరకు నిమ్మరసంతో నింపాలి. దానికి మూతపెట్టి ఎండ తగలని చోట పెట్టుకోవాలి. దీనిని ప్రతీ రోజు గమనిస్తూ ప్లాస్టిక్ జార్ మూతను తీసి పెడుతుండాలి. లేకపోతే దానిలో ఉత్పత్తి అయ్యే గ్యాస్ ప్రభావంతో జార్ పగిలిపోయే ప్రమాదం ఉంటుంది. ఇలా 10 నుంచి 15 రోజులకు నిమ్మరసంలో మునిగి ఉన్న కోడిగుడ్లు కరిగిపోయి చిక్కటి ద్రవంగా మారిపోతుంది. దానిని జాగ్రత్తగా కలిపి ఆ ద్రావణంలో 250 నుంచి 500 గ్రాముల బెల్లాన్ని మెత్తని చూర్ణంగా చేసి కలుపు కోవాలి. అలా కలిపిన ద్రావణాన్ని మళ్లీ నీడగా ఉండే చోట భద్రపర్చుకోవాలి. ఇలా మరో 15 రోజుల వరకు ప్రతి రోజు ఉదయం సాయంత్రం గమనిస్తూ కలుపుతూ ఉండాలి. ఇలా 20 నుంచి 30 రోజుల తరువాత తెల్లటి బాదం పాలు మాదిరిగా ఒక రకమైన ద్రావణం తయారవుతుంది. దీనినే గడ్ల ద్రావణం, ఎగ్ అమోనియా యాసిడ్ అంటారు. దీనిని మరో బాటిల్‌లోకి తీసుకుని జాగ్రత్త చేసుకోవాలి. దీనికి నీటి తడి ఎట్టి పరిస్థితుల్లోను తగలకుండా చూసుకోవాలి. దీనిలో అమ్మోనియా యాసిడ్స్, ప్రొటీన్లు, మైక్రో న్యూట్రియంట్స్, మేక్రో న్యూట్రియంట్స్‌తో పాటు పుష్కలంగా కాల్షియం ఉంటుంది.

కావాల్సిన పదార్థాలు ఇవీ

2 లీటర్ల యాసిడ్ తయారీకి..

కోడిగుడ్లు – 12
నిమ్మకాయలు (బాగా మగ్గినవి) – 2 కేజీలు
బెల్లం – 250 నుంచి 500 గ్రాములు
మూడు లీటర్ల సామర్థ్యం గల ప్లాస్టిక్ మగ్ – 1



పిచికారీకి సిద్ధం చేసిన గుడ్ల ద్రావణం

వినియోగం ఇలా..

గుడ్ల ద్రావణం తయారైన తరువాత పూత దశ దాటిన పంటకు ఒక లీటరు నీటికి 2 నుంచి 3 మిల్లీ లీటర్ల ద్రావణం కలిపి పిచికారీ చేసుకోవాలి. అదే పూత దశకు వచ్చాక ఒక లీటరు నీటికి 5 మిల్లీ లీటర్ల ద్రావణం కలిపి పిచికారీ చేసుకోవాలి. ఒక ఎకరం పొలానికి 200 లీటర్ల నీటికి ఒక లీటరు ద్రావణం కలిపి పచికారీ చేసుకోవచ్చు. దీనిని నెలకు ఒక సారి పిచికారీ చేసుకుంటే మంచి ఫలితాలు ఉంటాయి.



పాడి-పంట

దుర్గాడలో గుడ్ల ద్రావణం తయారు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది

ప్రయోజనాలు అనేకం



ప్రతి పంటకు దీనిని పిచికారీ చేయడం వల్ల పూత ఆశాజనకంగా నాణ్యమైన ఆరోగ్యవంతంగా వస్తుంది. పిందె నిలబడడానికి, ఆరోగ్యవంతంగా తయారవ్వడానికి ఇది ఎంతో దోహద పడుతుంది. పిందె రాలిపోకుండా కాపాడుతుంది. గుడ్డు ద్రావణంలో గుడ్డు తొక్కతో సహా కరిగించడం వల్ల అధికంగా కాల్షియం ఉత్పత్తి అయ్యి మొక్కలకు మంచి కాల్షియం అందిస్తాయి. మొక్కలకు అత్యంత అవసరమైన కాల్షియం అందడం వల్ల పంటలు నాణ్యమైన దిగుబడులు ఇస్తాయి. భూమి సారవంతమై మేలు చేసే బ్యాక్టీరియాలు పెరుగుతాయి. ఇది మొక్కలు వత్తిడి నుంచి బయటపడేలా చేస్తాయి, తద్వారా తెగుళ్ల పురుగులు అంత త్వరగా సోకే అవకాశం లేకుండా పోతుంది . దీనివల్ల క్లోరోఫిల్ పర్సంటేజ్ పెరుగుతుంది. తద్వారా పంటలలో ఆకులు పచ్చగా తయారై కిరణ జన్య సంయోగ క్రియ సక్రమంగా జరిగి పిండి పదార్థాలను మొక్కలు ఎక్కువగా తయారు చేసుకుంటాయి. దీనివల్ల మొక్కలు గుబురుగా పెరగడంతో పాటు కాయల పరిమాణం పెద్దవిగా ఉండి పంట దిగుబడులు పెరుగుతాయి. అదే పప్పు ధాన్యాలలో అయితే గింజలు నాణ్యంగా తయారవుతాయి. దీనిని నుంచి వచ్చే వాసన వల్ల కొన్ని రకాల పురుగులు పంటలకు సోకవు. ఇది మంచి పెస్ట్ కంట్రోలర్‌గా పని చేస్తుంది. రూ.వేలు ఖర్చు పెట్టి రసాయనాలు ఉపయోగించినా రాని ఫలితం కేవలం తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనాలు పొందవచ్చు.

– గుంద్ర శివ చక్రం, గో గాయత్రి ప్రకృతి వనరుల తయారీ శిక్షణ కేంద్రం, దర్గాడ

గంజాయితో ఉన్న నలుగురి అరెస్టు

4 కేజీల సరకు స్వాధీనం



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాస్

పిఠాపురం: ఇతర ప్రాంతాల నుంచి గంజాయి తెచ్చి పంచుకుంటున్న ఐదుగురు యువకులను మంగళవారం అరెస్టు చేసి 4 కేజీల సరకును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. గొల్లప్రోలు పోలీసు స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. కాకినాడ రేచర్లపేటకు చెందిన కడియపు ప్రేమ్‌కుమార్ మరో బాలుడు కలిసి అనకాపల్లి జిల్లా నక్కపల్లికి చెందిన గంజాయి సరఫరాదారు మద్దు లోకేష్ నుంచి సరకు తెచ్చేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. వీరితో పాటు పిఠాపురం మంగయ్యమ్మరావుపేటకు చెందిన దనాల మనోహర్, కొత్తపల్లి మండలం మూలపేటకు చెందిన రామిసెట్టి దుర్గాప్రసాద్ గంజాయి విక్రయిస్తుంటారు. నక్కపల్లి నుంచి గంజాయి తీసుకురాగా గొల్లప్రోలు శివారు ప్రాంతంలో ఒక లే అవుట్ వద్ద ఐదురుగు కలిసి తెచ్చిన గంజాయిని పంచుకున్నారు. దానిలో కొంత తాము వాడుకుని మిగిలిన దానిని ఎక్కువ రేటుకు విక్రయించాలనుకున్నారు. ఈ మేరకు అందిన సమాచారంతో ఎస్సై ఎస్ రామకృష్ణ తన సిబ్బందితో మాటు వేసి గంజాయితో మోటారు సైకిల్‌పై వెళుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించగా మిగిలిన ముగ్గురి వివరాలు తెలుసుకుని ఐదురురిని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. వారి నుంచి 4 కేజీల గంజాయితో పాటు ఒక మోటారు సైకిల్ స్వాధీనం చేసుకుని నిందితులను కోర్టులో హాజరుపర్చనున్నట్లు ఆయన తెలిపారు.

పంటకాలువలో పడి కౌలురైతు మృతి



ఘటన స్థలంలో పడిఉన్న నాగరాజు

కాజులూరు: మండలంలోని ఒంటితాడిలో పంటకాలువలో పడి తాళ్లరేవు మండలం కోరంగి శివారు బొడ్డువానిలంకకు చెందిన కౌలు రైతు నరాల నాగరాజు (38) మంగళవారం మృతిచెందాడు. స్థానికులు, గొల్లపాలెం పోలీసులు తెలిపిన వివరాల మేరకు బొడ్డువానిలంకకు చెందిన నాగరాజు కాజులూరు మండలం ఒంటితాడి పంచాయతీ పరిధిలో ఒక రైతుకు చెందిన రెండు ఎకరాల భూమి సాగు చేస్తున్నాడు. మంగళవారం చేనుకు గడ్డి మందు పిచికారీ చేసేందుకు పొలానికి వచ్చాడు. పొలం పనులకు వెళ్లిన వ్యవసాయ కూలీలు సాయంత్రం తిరిగి వస్తుండగా పంట కాలువలో నాగరాజు మృతి చెంది ఉండడాన్ని గమనించారు. వెంటనే హుటాహుటిన గొల్లపాలెం పోలీసులకు ఫిర్యాదుచేయగా పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నాగరాజు పొలానికి వచ్చే సమయంలోనే తీవ్ర నీరసంగా ఉన్నాడని దాంతో పొలం పనులు చేస్తూ ప్రమాదవశాత్తు పంట చేలో పడి మృతి చెంది ఉంటాడని రైతులు అభిప్రాయపడుతున్నారు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. గొల్లపాలెం ఎస్సై ఎం .మోహన్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుమార్తె కోసం తల్లిడిల్లి..



కొవ్వూరు రోడ్ కం రైల్ బ్రిడ్జిపై నుంచి గోదావరిలోకి దూకడానికి ప్రయత్నిస్తున్న నాగమణి



గోదావరిలో దూకిన నాగమణిని రక్షించి తీసుకుస్తున్న పట్టణ సీఐ, తదితరులు

- గోదావరిలోకి దూకి మహిళ ఆత్మహత్యా యత్నం
- నాలుగు నెలలుగా కూతురి ఆచూకీ లేకపోవడంతో మనస్తాపం
- రక్షించిన పట్టణపోలీసులు

తాళ్లపూడి(కొవ్వూరు): తన కుమార్తె నాలుగు నెలలుగా కనిపించడం లేదన్న మనస్తాపంతో కొవ్వూరుకు చెందిన మహిళ గోదావరిలో దూకి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. మంగళవారం చోటుచేసుకున్న ఈ ఘటనపై పట్టణ సీఐ విశ్వం తెలిపిన వివరాల మేరకు దేవరపల్లి మండలం దుద్దుకూరుకు చెందిన చిలకలపూడి నాగమణి రోడ్ కం రైల్వే బ్రిడ్జి పైకి ఎక్కి గోదావరిలోకి దూకినట్టు తెలిపారు. ఆమెను వెంటనే సమీపంలోని మత్స్యకారులు రక్షించారు. అయితే అపస్మారకస్థితిలో ఉన్న ఆమెను కొవ్వూరు ప్రభుత్వాస్పత్రికి తరలించినట్టు సీఐ తెలిపారు. 18 ఏళ్ల ఆమె కుమార్తె 4 నెలలుగా కనిపించడం లేదని మనస్తాపానికి గురైనట్టు ఆయన తెలిపారు. బంధువులు, స్నేహితుల ఇళ్ల దగ్గర అన్నిచోట్లా వెతికినప్పటికీ కుమార్తె ఆచూకీ లభించకపోవడంతో ఆమె ఈ ఘాతుకానికి ఒడిగట్టిందని, ఆమెను రక్షించడానికి పోలీసులు, ఫైర్ సిబ్బంది, ఇతర అధికారులు తీవ్రంగా శ్రమించారని సీఐ తెలిపారు. ఆమెను పట్టణ పోలీసులు, ఆర్డీవో రాణి సుస్మిత, తహసీల్దార్ తదితరులు వివరాలు అడిగి తెలుసుకున్నారు.

భర్త అనుమానించాడని భార్య ఆత్మహత్యాయత్నం



ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్యామల

అమలాపురం రూరల్: భర్త అవమానించాడని మనస్తాపం చెంది మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడి స్థానిక ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. తాలూకా ఎస్‌ఐ వై.శేఖరబాబు తెలిపిన వివరాల మేరకు స్థానిక హైస్కూల్ సెంటర్‌కు చెందిన దూనబోయిన రమేష్‌కు రూరల్ మండలం నల్ల మిల్లి రాజీవ్ గృహకల్పకు చెందిన శ్యామలతో వివాహం జరిగింది. వివాహమైన కొద్దికాలానికే అతడు ఉపాధి నిమిత్తం కువైట్ వెళ్లాడు. ఎనిమిది నెలల క్రితం స్వగ్రామానికి తిరిగివచ్చి తనకు తెలిసిన సెంట్రింగ్ పని చేసుకుని జీవిస్తున్నాడు. గల్ఫ్‌లో ఉండగానే భార్యపై అనుమానం పెంచుకున్నాడు. దాంతో ఈ నెల 14న నేదునూరు పెదపాలెంలో పెద్దల సమక్షంలో తగువు పెట్టారు. కాపురానికి తీసుకువెళ్లనని గ్రామపెద్దల వద్ద రమేష్ చెప్పడంతో సోమవారం రాత్రి ఇంటికి తిరిగి వచ్చిన శ్యామల ఇంట్లో ఉన్న గడ్డిమందును తాగేసింది. వెంటనే గుర్తించిన తల్లి గడ్డి మందు సీసాను పక్కకు గెంటేసింది. అయితే అప్పటికే అపస్మారక స్థితికి చేరుకున్న శ్యామలను అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఏరియా ఆసుపత్రిలో మంగళవారం శ్యామల ఇచ్చిన సమాచారం ఆధారంగా భర్త రమేష్ కుటుంబసభ్యులపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శేఖర్‌బాబు తెలిపారు.

కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
అంబాజీపేట కొబ్బరి మార్కెట్	
కొత్తకొబ్బరి (క్వింటాల్)	23,000 – 23,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	29,500
గటగట (వెయ్యి)	27,500

అక్కాచెల్లెళ్ల అదృశ్యం



అక్కాచెల్లెళ్లు నాగవల్లి, పద్మప్రియ

కడియం: స్థానికంగా ఉన్న ఆంజనేయస్వామి గుడికి వెళ్లి వస్తామని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లిన అక్కాచెల్లెళ్లు పి.వీరనాగవల్లి, పి.పద్మప్రియ అదృశ్యమైనట్టు పోలీసులు కేసు నమోదు చేశారు. కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ అల్లు వేంకటేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 10, 9 తరగతులు చదువుకున్న వీరిద్దరు ప్రస్తుతం ఇంటి వద్దే ఉంటున్నారు. మంగళవారం కావడంతో అంజనేయస్వామి గుడికని వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. వీరి ఆచూకీ తెలిస్తే కడియం పోలీస్ స్టేషన్ 9440796587, 9347705890 నంబర్లకు సమాచారం ఇవ్వాల్సిందిగా ఆయన కోరారు.

ప్రపంచం అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది

దౌత్యవేత్త డాక్టర్ బాలభాస్కర్



సెమినార్‌లో మాట్లాడుతున్న డాక్టర్ బాలభాస్కర్, పక్కన వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ కూడా ఉన్నారు

రాజానగరం: సాంకేతిక విఘాతం, సోషల్, పొలిటికల్, డిప్లమేటిక్ చాలెంజెస్, ఎనర్జీ సెక్యూరిటీ, ఫుడ్ సెక్యూరిటీ వంటి అనేక సవాళ్లను ప్రపంచం ఎదుర్కొంటోందని ప్రముఖ దౌత్యవేత్త డాక్టర్ బి.బాలభాస్కర్ అన్నారు. నన్నయ యూనివర్సిటీలోని ఈసీ హాలులో ‘భారతీయ దృక్పథంలో విఘాతం కలిగించే సాంకేతిక పరిజ్ఞానాల భౌగోళిక శాస్త్రాన్ని నావిగేట్ చేయడం’ అనే అంశంపై మంగళవారం సెమినార్ నిర్వహించారు. దౌత్యవేత్తగా 70 దేశాలతో సంబంధాలను కలిగివున్న బాలభాస్కర్ మాట్లాడుతూ ముఖ్యంగా టెక్నాలజీలో జరిగే తీవ్రమైన మార్పుల వల్ల సమాజంలో, పరిశ్రమలో ఆర్థిక మోడల్స్, ట్రేడ్ మోడల్స్, టారిఫ్ స్ట్రక్చర్‌లో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయన్నారు. వాటిని ముందుగా గ్రహించకపోతే ప్రపంచ దేశాలు పెను సవాళ్లను ఎదుర్కోక తప్పదన్నారు. సాంకేతికంగా ప్రపంచంలో జరుగుతున్న మార్పులపై విద్యావేత్తలు, శాస్త్రవేత్తలు, నిపుణులు దృష్టి సారించాలనే ఉద్దేశంతో యూనివర్సిటీలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటుచేయడం హర్షణీయమన్నారు. కోవిడ్ వంటి విపత్కరమైన పరిస్థితులలో భారత ధాన్యాగారం విలువ ప్రపంచానికి తెలిసిందన్నారు. అన్ని రంగాలలో నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. ఈ క్రమంలో విద్యా వ్యవస్థలో ఉన్న అధ్యాపకులు నిత్య విద్యార్థులుగా సంబంధిత సబ్జెక్టులలో అప్‌డేట్ కావాలన్నారు.

ఎర్త్ నుండి స్పేస్ వరకు అన్ని రంగాలలో క్వాంటం టెక్నాలజీ ప్రభావం చూపిస్తోందని, దానిపై మంచి పట్టు సాధించాలన్నారు. వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ మాట్లాడుతూ దౌత్యవత్తగా దేశాల మధ్య సమస్యలను పరిష్కరించడంలో డాక్టర్ బాలభాస్కర్ కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, కోఆర్డినేటర్ డాక్టర్ వి.పెర్సిస్, డాక్టర్ బి.జగన్‌మోహన్‌రెడ్డి, డాక్టర్ పి. సురేష్‌వర్మ, డాక్టర్ కె.రమణేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రావులపాలెం: మండలంలోని గోపాలపురం జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గోపాలపురం గ్రామానికి చెందిన అవిడి సత్తిపండు (51), అతని స్నేహితుడైన అత్తిలి ఏసుబాబు స్థానిక వ్యవసాయ చెక్‌పోస్టు సమీపంలో పని ముగించుకుని నడుచుకుంటూ వస్తుండగా వెనుక అదే దారిలో వచ్చిన ప్రైవేట్ టూరిస్టు బస్సు వారిని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిని కొత్తపేట ఏరియా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించగా అప్పటికే సత్తిపండు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. గాయాలపాలైన ఏసుబాబును మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సత్తిపండు కొడుకు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు సీఐ శేఖర్‌బాబు తెలిపారు.

అంతర్ జిల్లా నేరస్తుడి అరెస్టు



వస్తువులను రికవరీ చేసిన పోలీసులు

సామర్లకోట: పట్టణంలో దొంగతనాలపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు సీఐ ఎ.కృష్ణభగవాన్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, ప్రత్యేక నిఘాలో భాగంగా స్థానిక కొత్త వంతెన సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించామన్నారు. ఇంటి దొంగతనాలు చేస్తున్న అంతర్ జిల్లా నేరస్తుడిగా అంగీకరించినట్లు చెప్పారు. నిందితుడు కంచర్ల మోహనరావు నుంచి ఇప్పటివరకు నాలుగు దొంగతనాలకు సంబంధించి సుమారు 50 గ్రాముల బంగారం, 300 గ్రాముల వెండిని రికవరీ చేసినట్లు తెలిపారు. ఈ మేరకు అతడిని మంగళవారం కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించారన్నారు. ఇంటి యజమానులు ఇతర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు బంధువులు, పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అదే విధంగా పోలీసు శాఖ అందిస్తున్న లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్‌ను వినియోగించుకోవాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే సమీప పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. సమావేశంలో క్రైమ్ సీఐ అంకబాబు, ఎస్సై రమేష్‌బాబు పాల్గొన్నారు.

పరిపాలనపై పట్టు ఉండాలి

- ఈటీసీ ప్రిన్సిపాల్ ప్రసాదరావు
- ఉమ్మడి జిల్లా మహిళా ఎంపీపీ, జెడ్పీటీసీల శిక్షణ



ఎంపీపీ, జెడ్పీటీసీలకు శిక్షణ ఇస్తున్న ఫ్యాకల్టీలు

సామర్లకోట: అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావడం ద్వారా పరిపాలనా నైపుణ్యం ప్రదర్శించడానికి మహిళా ప్రజాప్రతినిధులకు శిక్షణ ఇస్తున్నట్టు విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ కేఎస్‌వీ ప్రసాదరావు అన్నారు. ఉమ్మడి జిల్లాలోని మహిళా ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులకు మూడు రోజుల శిక్షణలో భాగంగా రెండో రోజు మంగళవారం గ్రూప్ డిస్కషన్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్పు ద్వారా విజేతలు, మహిళా సాధికారితతో స్వపరిపాలన సాధ్యం అనే అంశంపై శిక్షణ ఉంటుందని చెప్పారు. పదవీ కాలం పూర్తి అవుతున్న తరుణంలో ఇస్తున్న శిక్షణ జీవిత కాలంలో ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రస్తుతం చేస్తున్న పదవులలో మంచి సమర్థతను చూపించడం ద్వారా మరింత ఉన్నత పదవులు లభించే అవకాశం ఉంటుందన్నారు. శిక్షణతో సమర్థతను పెంచుకోవడం ద్వారా మంచి పదవులు లభించే అవకాశం ఉంటుందన్నారు. మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు ఉండటంతో నాయకత్వ లక్షణాలు పెంపొందించుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నాయకత్వం ఏ ఒక్కరికో పరిమితం కాకూడదన్నారు. మహిళలు తమ సమర్థతను పూర్తి స్థాయిలో ప్రదర్శించడం లేదనే ఆరోపణ ఉన్నాయన్నారు. దీనిలో భాగంగా మహిళ స్వయంగా నిర్ణయాలు తీసుకుంటే మంచి ఫలితాలు వస్తాయనే కేంద్ర ప్రభుత్వం భావిస్తోందని తెలిపారు. దీని కోసమే శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ప్రజల ముందు ఏ విధంగా మాట్లాడాలి, ఇతరుల నుంచి విషయాలు తెలుసుకోవడం, పంచాయతీ చట్టాలు, పరిపాలనపై అవగాహన ఉండాలన్నారు. స్వయంగా తీసుకునే నిర్ణయాలు ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలన్నారు. సమర్థ నాయకత్వానికి చదువుతో సంబంధం లేదన్నారు. ఈ శిక్షణలో వైస్ ప్రిన్సిపాల్ జి.రమణ, కోర్సు డైరెక్టర్ కె.సుశీల, ఫ్యాకల్టీలు పి.శర్మ, డి.శ్రీనివాసరావు, ఎం.చక్రపాణిరావు, కేఆర్ నిహారిక, పి.రామకృష్ణ శిక్షణ ఇచ్చారు.

ఓఎన్‌జీసీ టెర్మినల్ సమీపంలో ప్రమాదం

- విద్యుత్ వైర్ల సర్క్యూట్‌లో మంటలు చెలరేగి కాలిపోయిన తాటి, ఈత చెట్లు
- సకాలంలో మంటలు ఆర్పిన అగ్నిమాపక సిబ్బంది



విద్యుత్ సర్క్యూట్‌లో చేలరేగిన మంటలను అదుపుచేస్తున్న ఓఎన్‌జీసీ అగ్నిమాపక సిబ్బంది

అల్లవరం: ఓడలరేవులో ఓఎన్‌జీసీ టెర్మినల్‌ను అనుకుని అనధికారికంగా సాగు చేస్తున్న ఆక్వా చెరువుల వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ వైర్లు సర్క్యూట్‌లో మంగళవారం మధ్యాహ్నం మంటలు చేలరేగాయి. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి చెరువుల వరకు నేలపై వేసిన విద్యుత్ వైర్ల నుంచి చేలరేగిన మంటలకు ఆరు తాడి చెట్లు, మూడు ఈత చెట్లకు మంటలు వ్యాపించి కాలిపోయాయి. దీంతో స్థానికులు, ఓఎన్‌జీసీ అధికారులు అప్రమత్తమై, విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. అనంతరం ఓఎన్‌జీసీకి చెందిన అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. దీంతో స్థానికులు, ఓఎన్‌జీసీ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. గతంలో ఇదే మాదిరిగా విద్యుత్ సర్క్యూట్‌లో ప్రమాదం జరిగింది. అయినా అనధికార ఆక్వా సాగు చేస్తున్న రైతుల్లో ఏ మార్పూ రావడం లేదు. టెర్మినల్‌ను అనుకుని సాగుతున్న ఆక్వా చెరువులకు అనధికార విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడం వల్లనే ఈ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనధికార చెరువులకు విద్యుత్ కనెక్షన్‌కు అనుమతులు ఇచ్చిన విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అనధికార ఆక్వా సాగు చేస్తున్నా చర్యలు తీసుకోవడంలో మత్స్యశాఖ అధికారులు విఫలమవుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.